# వేగవంతంగా పూర్తిచేయాలి



అస్ఫక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, వీడీడీఎఫ్ ప్రతినిధులు

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో టెలికాన్ఫరెన్స్

వికారాబాద్, ఏప్రిల్ 19 : అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి వేగవంతంగా పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఈవో, ఎంపీడీవో, ఏఈ తదితర అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన నిర్మాణ పనులను రెండు రోజుల్లో గుర్తించి ప్రారంభించాలని ఆదేశించారు. అన్ని పాఠశాలలను పరిశీలించి ఏ పాఠశాలలో ఏ పనులు చేయాల్సి ఉంది.. పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంజూరైన నిధులతో ఆయా పాఠశాలల్లో ఈజీఎస్, పంచాయతీ రాజ్ ఎస్ఈ, డీఈలు, ఏఈలు ఇప్పటివరకు గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటూ నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేయించాలన్నారు. మండలాల వారీగా అన్ని వివరాలు తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణ పనులు పూర్తి ప్రోగ్రెస్‌లోకి రావాలని సూచించారు. ఈఈలు, డీఈలు నిర్మాణ పనులను పర్యవేక్షించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఈవో రేణుకాదేవి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, అన్ని మండలాల డీఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**పర్యవేక్షించాలి.. పరిష్కరించాలి**

జిల్లాలోని ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రతి గ్రామాన్ని తప్పనిసరిగా పర్యవేక్షించి గ్రామ సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజూ తమ పరిధిలో ఉన్న గ్రామాలను పర్యవేక్షించాలన్నారు. గ్రామ పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, నర్సరీ, హరితహారం తదితర సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పరిధిలో ముందు ఎలా ఉంది.. తర్వాత ఎలా ఉందనేది ఫొటోలతో నివేదిక ఇవ్వాలని సూచించారు. గ్రామ స్థాయిలో పరిపాలన పరంగా చేయాల్సిన పనుల బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అనంతరం మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**సివిల్ సర్వీస్ ర్యాంకర్‌కు సన్మానం**

సివిల్ సర్వీస్‌లో జిల్లా నుంచి ఉత్తమ ర్యాంకు సాధించిన అభ్యర్థిని శుక్రవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం (వీడీడీఎఫ్), ఎస్ఎస్‌పీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మట్టిలో మాణిక్యాలు ఉంటాయనడానికి వికారాబాద్ జిల్లా నుంచి సివిల్ సర్వీస్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన మారుమూల గ్రామీణ విద్యార్థులే నిదర్శనమన్నారు. సివిల్ సర్వీస్‌లో 770 ర్యాంకు సాధించిన పెద్దేముల్ మండలంలోని గొట్లపల్లికి చెందిన మహ్మద్ అస్ఫక్‌ను కలెక్టర్‌తో పాటు వీడీడీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్, పలువురు ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా అస్ఫక్ తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో వీడీడీఎఫ్ ప్రతినిధులు మారుతి, తిరుపతి రెడ్డి, ఫక్రుద్దీన్, మాణిక్‌రెడ్డి, కేదార్‌నాథ్, సుజిత్ మఠం లా, ఆస్ఫాక్ తల్లిదండ్రులు మహ్మద్ జాఫర్, రిజ్వాన్ బేగం, పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు
# దరఖాస్తుల ఆహ్వానం

**ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్**



వికారాబాద్, ఏప్రిల్ 19 : తెలంగాణలో పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్–2024 పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పరమేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు రుసుం ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. polycet.sbtet.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు తేదీ ముగిసిన తర్వాత ఏప్రిల్ 24 వరకు రూ. 100, ఏప్రిల్ 26 వరకు రూ.300 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 24న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష జరిగిన 12 రోజుల తర్వాత ఫలితాలు వెలువడుతాయని తెలిపారు.

# 'ఎంసీఎంసీ' అనుమతి తప్పనిసరి

సిటీబ్యూరో, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ఎలక్ట్రానిక్ మీడియా, లోకల్ కేబుల్, సోషల్ మీడియా ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల్లో ప్రకటనలు, ఆడియో, ఎఫ్ఎం రేడియోల్లో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వీడియో మెసేజ్‌లు, సినిమా థియేటర్లలో ప్రకటనలకు ఎంసీఎంసీ కమిటీ ద్వారా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్వో కార్యాలయం ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటనలకు తప్పనిసరిగా 48 గంటల ముందు ఎంసీఎంసీ అనుమతి కోసం నిర్ణీత దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థి గానీ తన ఏజెంట్ గానీ అప్లై చేసుకోవచ్చన్నారు. ప్రింటింగ్ ప్రెస్ ప్రింట్ చేసిన కరపత్రాలపై పబ్లిషర్ పేరు, అడ్రస్, హ్యాండ్ బిల్ ఇతర పత్రాలు ముద్రించిన సందర్భంలో తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని సూచించారు.

# రాంగ్‌రూట్ వాహనాలపై కేసులు

మియాపూర్, ఏప్రిల్ 19: మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలను నిలువరించి వాటిని నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, ఎస్ఐ నవీన్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి ఠాణా పరిధిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, వీఎన్ఆర్ కళాశాల, దీప్తిశ్రీ నగర్ యూటర్న్‌ల వద్ద ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలను నిలిపి వాటిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించే వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా

# సమర్థవంతంగా ఎన్నికల బాధ్యతలు

**ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా**

రంగారెడ్డి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు సమర్థవంతంగా ఎన్నికల బాధ్యతలను నిర్వర్తించాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా అధికారులను ఆదేశించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రాలు శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సం దర్భంగా రాజేంద్రనగర్‌లోని నారం గెస్ట్‌హౌస్‌లో వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతి మా సింగ్, ఇతర అధికారులతో కలిసి ఏఆర్‌వోలు, నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎ న్నికల ప్రచారంలో చేసే ఖర్చులను ఎలా లెక్కిస్తున్నా రు? తదితర వివరాలను వ్యయ పరిశీలకులు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**సమన్వయంతో ఎన్నికల విధులు**

ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎ న్నికల నిర్వహణలో అన్ని టీములు సమన్వయంతో ఎ న్నికల విధులు నిర్వహించాలని, అనుమానాస్పద ఖా తాలను చెక్ చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌సీ అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరపున ఖర్చుచేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చూపెట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతతో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టినా, ఓటరును భయభ్రాంతులకు గురి చేసినా.. లేదా బలవంతంగా ప్ర భావితం చేసినా.. సి–విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందని తెలిపారు. సి–విజిల్ ద్వారా చేసే ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామేఇ తెలిపారు. ఇంగ్లిష్‌లో కానీ తెలుగులో కానీ సమస్యను పం పించవచ్చని అన్నారు. చేవేళ్లపార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలు సి–విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, ఏఆర్‌వోలు వెంకట్ రెడ్డి, సూరజ్ కుమార్, సాయిరామ్, డీసీపీ, వివిధ టీముల నోడల్ అధికారులు, ఎంసీసీ టీం, అకౌంటింగ్ టీం సభ్యులు, పోలీసు టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్ సందర్శన**

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీల కులు, ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ 2004 బ్యాచ్‌కు చెందిన సెంథిల్ కుమా రన్ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని సందర్శించారు. కలెక్టరే ట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీ ఎంసీ ద్వారా చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి అనంతరం కంట్రోల్ రూము ను పరిశీలించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

# బీఆర్ఎస్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

- మనం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పి.రోహిత్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే పి.రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. 96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరిని ఒక్కతాటికి తీసుకొచ్చిన చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. పదేండ్లు బీఆర్ఎస్ పాలనలో మనం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో రెండు సార్లు చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించిందన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో కూడ బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

**నట్టేట ముంచుతున్న కాంగ్రెస్**

తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచుతుందని రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రె స్ ఒక్కటై ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు బీజేపీ, కాంగ్రెస్‌తో తాండూరుకు ఒరిగిందేమిలేదన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో ఉన్నత పదవులు అనుభవించిన నాయకులు నేడు పార్టీలు మారడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలతో చేతులు కలిపి బీఆర్ఎస్ ఓటమికి కారణమైన వ్యక్తులను ఎన్నటికీ ఎక్కడ గెలవనివ్వమని హెచ్చరించారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మోసం చేసిన ద్రోహులను చిత్తు చిత్తుగా ఓడిస్తామన్నారు. బీసీ వర్గానికి చెందిన మంచి మనసున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు తాండూరు నియోజక వర్గం భారీ మెజార్టీ తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు శ్రీశైల్‌రెడ్డి, రాజుగౌడ్, నర్సిరెడ్డి, శకుంతల, వీరేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించిన పోలీసులు

# చోరీకి గురైన 50 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

- వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి
- సీసీఎస్ పోలీసులకు అభినందనలు

వికారాబాద్, ఏప్రిల్ 19 : వికారాబాద్ జిల్లాలో అపహరణకు గురైన సెల్‌ఫోన్‌లను సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న 50 మంది బాధితులకు ఎస్పీ కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల టెక్నాలజీలను ఉపయోగించిందని గుర్తు చేశారు. బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు నూతనంగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. రూ.8,36,061 విలువ చేసే 50 సెల్‌ఫోన్‌లను సీసీఎస్ పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటిలో వికారాబాద్ సబ్ డివిజన్ నుంచి 21, పరిగి సబ్ డివిజన్ నుంచి 19, తాండూరు సబ్ డివిజన్ నుంచి 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం సీసీఎస్ ఇన్‌స్పెక్టరు బలవంతయ్య, అన్వర్ పాషా, ఎస్సైలు జయశంకర్, కృష్ణయ్య, సిబ్బంది గోవింద్, సత్తయ్య గౌడ్, అంజప్ప, అలిమోద్దీన్, రాఘవేందర్ రెడ్డి, రవీందర్, రామకృష్ణలను అభినందించి రివార్డ్స్ అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

**వికారాబాద్ అగ్నిమాపక అధికారి వెంకటరమణారెడ్డి**

వికారాబాద్, ఏప్రిల్ 19 : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వికారాబాద్ అగ్నిమాపక అధికారి ఎన్.వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని వేదిక్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, చిన్నారులు అగ్నికి దూరంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలో తీసుకోవాలో అవగాహన ఉండాలన్నారు. మంటలు చిన్నగా ఉన్నప్పుడే గుర్తించి వాటిని ఆర్పేందుకు ప్రయత్నించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారికి బేసిక్ ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకొనే నివారణ చర్యలు అవగాహన కల్పించారు. ప్రతి మూడు నెలలకోసారి ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అగ్ని మాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం అపార నష్టం



వికారాబాద్: నేలకొరిగిన జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



చేవెళ్లటౌన్: వర్షానికి నేల పాలైన బొప్పాయి పంటను చూపిస్తున్న రైతు



ఆదిబట్ల: కొంగరకలాన్‌లో పిడుగు పాటుకు కాలిపోతున్న తాటి చెట్టు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గత రెండు రోజులుగా ఈదురుగాలులు వీయడంతో పాటు అకాల వర్షం కురిసింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో పంటలు నేల కొరిగాయి. పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. చెట్లు నేలకొరిగాయి. కోళ్ల ఫారాలు కూలిపోయాయి. బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. దెబ్బ తిన్న పంటలను పరిశీలించి ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.**

వికారాబాద్, ఏప్రిల్ 19 : వికారాబాద్ జిల్లాలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలువురు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వికారాబాద్ మండల పరిధిలోని పులుసు మామిడి, సిద్దులూర్ గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయి. కోళ్ల ఫారాలు కూలిపోయాయి. సిద్దులూర్ మునగల్ రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్త కాపు అనంతరెడ్డి (పులుసు మామిడి గ్రామం) కోళ్ల ఫారం ఈదురుగాలులకు కూలిపోయి రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. పులుసుమామిడిలో భారీగా ఈదురుగాలి వీయడంతో గ్రామంలోని కెరెల్లి అంబారెడ్డి పొలంలో జొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. గ్రామం సమీపంలో భారీ వృక్షం నేలకొరిగింది. పలువురి రైతుల పంట పొలాలు సైతం పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయాన్ని గ్రామస్తులు వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వడంతో. శుక్రవారం వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**బొప్పాయి పంట నేల మట్టం..**

చేవెళ్లటౌన్ : మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి బొప్పాయి పంట నేలకొరిగింది. గ్రామానికి చెందిన బల్వంత్‌రెడ్డి ఏడు ఎకరాల్లో గతేడాది జూన్‌లో బొప్పాయి పంటను సాగు చేశారు. దాదాపు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అకాల వర్షానికి రూ.6లక్షల నుంచి రూ.7లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

**యాచారంలో భారీ వర్షం**

యాచారం : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని మేడిపల్లి, తక్కళ్లపల్లి, నానక్‌నగర్, మల్కీజ్‌గూడ, యాచారం, చింతపట్ల తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మేడిపల్లిలో ఈదురుగాలులతో కూడిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి, డ్రైనేజీలు పొంగి పొర్లాయి. మండుటెండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఒకింత ఎండల నుంచి ఉపశమనం లభించింది. దీంతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో వడ్లు నేల రాలి వరి పంటకు నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**కొంగరకలాన్‌లో పిడుగు..**

ఆదిబట్ల: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో శుక్రవారం సాయంత్రం పెద్ద ఎత్తున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని ఓ తాటి చెట్టుపై పిడుగు పడడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. తాటి చెట్టు పూర్తిగా కాలి పోయింది.



యాచారం : యాచారంలో కురుస్తున్న వర్షం